# పుస్తక సమీక్ష

## కాకతీయుల కాలయంత్రం



**జాయప** సేనాని కాకతీయ చక్రవర్తి గణపతిదేవుడి బావమరిది. ఆయన ఆస్థానంలో గజ సాహిణిగా బాధ్యతలు నిర్వర్తించాడు. ద్వీపదేశపు రాజు అయ్యవంశానికి చెందిన పిన్నచోడుని కొడుకు. జాయప పేరు చెప్పగానే చరిత్ర పరిజ్ఞానం ఉన్నవాళ్లకు గుర్తుకువచ్చే పుస్తకం 'నృత్త రత్నావళి'. ఇదే కాకుండా 'వాద్య రత్నావళి', 'గీత రత్నావళి' కూడా రచించినట్టు తెలుస్తున్నది. చేబ్రోలులో ఓ శాసనం కూడా జాయప సేనాని వేయించాడు. ఇలాంటి శాసన, కాకతీయుల చరిత్రను వివరించే ఆధారాలతో మత్తి భానుమూర్తి 'జాయ సేనాపతి' చారిత్రక కాల్పనిక నవల రచనకు ఉపక్రమించారు. ఈ నవల నమస్తే తెలంగాణ దినపత్రిక ఆదివారం అనుబంధం 'బతుకమ్మ'లో సీరియల్‌గా వస్తున్నది. గణపతిదేవుడి సేనలు ద్వీపదేశాన్ని ఆక్రమించిన తర్వాత తన అక్కలు నారాంబ, పేరాంబతో కలిసి జాయప ఓరుగల్లు చేరుకుంటాడు. అయితే, అంతఃపురానికి వెళ్లకుండా ఓ సైనికుడి ఇంట్లో సామాన్యుడిలా పెరిగి పెద్దవాడవుతాడు. నృత్యంలో శిక్షణ పొందుతాడు. యుద్ధవిద్యల్లో ఆరితేరతాడు. వెలనాటి పృథ్వీశ్వరుడితో జరిగిన యుద్ధంలో పాల్గొని గణపతిదేవుడి మెప్పు పొందుతాడు. పిన్నచోడుని కొడుకే జాయప అని గణపతిదేవుడు అసలు విషయం తెలుసుకుంటాడు. నారాంబ, పేరాంబను వివాహం చేసుకుని గణపతిదేవుడు అయ్యవంశం వారితో వియ్యమందుతాడు. అలా జాయప సేనాని గణపతిదేవుడికి ఆత్మీయ బంధువుగా మారిపోతాడు. ఇక్కడితో రచయిత 'జాయ సేనాపతి'లో తొలి భాగం ముగించారు. ఇది చదువుతుంటే కాకతీయుల కాలపు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విశేషాలు కండ్ల ముందు మెదులుతాయి. అయితే, చక్రవర్తుల జీవితం కాకుండా ఓ ప్రతిభావంతుడైన సామంతుడి జీవితాన్ని రచన అంశంగా ఎంచుకోవడం భానుమూర్తి ప్రత్యేకత. అలా మరుగునపడి ఉన్న అంశానికి తనదైన శైలిలో వర్ణనలు చేస్తూ పుస్తకం ఆసాంతం అద్భుతంగా రూపుదిద్దారు.

### జాయ సేనాపతి

**రచన:** మత్తి భానుమూర్తి
**పేజీలు:** 240; **ధర:** రూ. 280
**ప్రతులకు:** ప్రముఖ పుస్తకాల దుకాణాలు

## బుక్ షెల్ఫ్

### గుప్పెడు మల్లెలు

**రచన:** జిల్లేళ్ళ బాలాజీ
**పేజీలు:** 132;
**ధర:** రూ. 150
**ప్రచురణ:** పార్వతీ విశ్వం ప్రచురణలు
**ప్రతులకు:**
**ఫోన్:** 98666 28639



### జెన్నీ

**రచన:** అపర్ణ తోట
**పేజీలు:** 87;
**ధర:** రూ. 100
**ప్రచురణ:** బోధి
**ప్రతులకు:** నవోదయ బుక్ హౌస్
ఫోన్: 92474 71362



### నా.. నానీలు

**రచన:** నానా
**పేజీలు:** 75;
**ధర:** రూ. 90
**ప్రతులకు:** 98491 39337



## ఘనం.. పీవీ వనం

### మద్ది మామ మహాబలుడు



మద్దిని వృక్షశాస్త్ర పరిభాషలో 'టర్మినేలియా అర్జున' అని పిలుస్తారు. 'అర్జున చెట్టు' అని ఎక్కువగా పిలుస్తారు. ఇది భారత దేశమంతటా కనిపించే చెట్టు. శ్రీలంక, బంగ్లాదేశ్, మలేషియా, ఇండోనేషియా, కెన్యాలలోనూ విరివిగా కనిపిస్తుంది.

మద్దిలో రెండు రకాల (ప్ర)జాతులున్నాయి. ఒకటి తెల్లమద్ది. రెండోది నల్ల మద్ది. నల్ల మద్ది చాలా బలమైనది. ఉక్కుతో సమానమైనదని చెప్పుకోవాలి. చేద బావులకు అడ్డంగా ఉండే మొద్దు, ఇంటి నిర్మాణంలో స్తంభాలు, దూలాలు, వాసాలకు దీనిని ఉపయోగిస్తారు. రోళ్లు, రోకళ్ల నల్ల మద్దితో తయారు చేస్తారు. మద్ది నుంచి స్రవించే జిగురుని కాల్చితే సువాసన వస్తుంది. అందుకే దీనిని గంధపు చెట్టు అని కూడా పిలుస్తారు. టస్సర్ సిల్కుని ఉత్పత్తి చేసే అంతేరియా పఫియా రకం పట్టు పురుగులు మద్ది చెట్టు ఆకులను తింటాయి. ఇవి మద్ది చెట్లపై ఉంటాయి.

మద్ది బెరడులో క్యాల్షియం, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. యాంటి ఆక్సిడెంట్లు, వాపులను తగ్గించే, సూక్ష్మ క్రిములను హరించే స్వభావం కలిగిన ఔషధ మూలకాలు ఉంటాయి. అందుకే ఆయుర్వేదంలో మద్దికి ప్రాధాన్యం ఉంది. మద్ది చెక్క కషాయం గుండె జబ్బులను నివారిస్తుంది. ఈ కషాయం వల్ల గుండె కండరాలు బలపడతాయి. గుండె పనితీరు మెరుగవుతుంది. ప్రతి రోజూ మద్ది బెరడు కషాయాన్ని పాలతో కలిపి ఒకటి, రెండుసార్లు తీసుకుంటే అధిక రక్తపోటుని సరిచేస్తుంది. గుండె సంబంధ వ్యాధులతోపాటు అతిసారం, ఆస్తమా, దగ్గుని కూడా మద్ది కషాయం తగ్గిస్తుంది. మద్ది బెరడుని పొడి చేసి, నీళ్లు కలిపి చర్మంపై రాసుకుంటే దద్దుర్లు, దురద, ఎగ్జిమా, సొరియాసిస్ లాంటి చర్మ వ్యాధులు పోతాయి.

**- ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ కూతురు**

## అది ఎవరు?

(...13వ పేజీ తరువాయి)

### సమాధానం:

క్రైమ్ స్పాట్‌కు వచ్చీరాగానే 'ఈ టైమ్‌లో ఓఆర్ఆర్‌పై ఏం చేస్తున్నారం'టూ క్రాంతిని రుద్ర ప్రశ్నించాడు. దానికి తాను ఓఆర్ఆర్ మీదుగా కారులో వెళ్తుండగా బ్యాటరీ డౌన్ కావడంతో కారు ఆగిపోయిందని క్రాంతి బదులిచ్చాడు. ఇంతలో ఎదురుగా రోడ్డు మీద జంతువు దేన్నో రక్కుతున్న శబ్దం వినిపించి కారు హెడ్‌లైట్లు ఆన్‌చేసి శవాన్ని చూసినట్టు చెప్పాడు. నిజానికి కారు బ్యాటరీ డౌన్ అయ్యాక, హెడ్‌లైట్లు కూడా ఆన్ కావు. ఈ చిన్న లాజిక్‌నే రుద్ర కనిపెట్టాడు. పక్కనే ఉన్న టోల్‌ప్లాజా నుంచి కారు దాటడం సీసీటీవీలో రికార్డు కావడంతో భవిష్యత్తులో ఈ హత్య తనమీదకు వస్తుందని భావించిన క్రాంతి.. తాను తప్పించుకోవడానికి ఏమీ తెలియనట్టు తానే పోలీసులకు సమాచారమిచ్చాడు. అయితే, కారు బ్యాటరీ డౌన్ అయిందని అబద్ధం చెప్పి దొరికిపోయాడు. కాగా.. క్రాంతి ఈ హత్యను ఎందుకు చేశాడు? ఒక్క గాయం కనిపించకుండా కుర్రాడిని ఎలా చంపాడు? దీని వెనుక కారణమేంటన్న విషయాలపై రుద్ర టీమ్ దర్యాప్తు మొదలుపెట్టింది.